





కర్నూలు నగరంలో ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్ర గ్రహణం కనిపించింది. రాత్రి 9:56 గంటలకు గ్రహణం ప్రారంభమైంది.. 11 గంటల తర్వాత సంపూర్ణ చంద్ర గ్రహణం కనిపించింది. వాటి దృశ్యాలివీ..





నేడు కర్నూలుకు వైఎస్ షర్మిల



కర్నూలు అర్బన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉల్లి, టమోటా రైతులకు మద్దతు తెలిపేందుకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం కర్నూలుకు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ సిటీ ప్రెసిడెంట్ షేక్ జిలానీబాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు పుల్లూరు టోల్ ప్లాజా వద్ద పార్టీ శ్రేణులు ఆమెకు ఘన స్వాగతం పలుకుతారని పేర్కొన్నారు. అక్కడి నుంచి కొత్త బస్టాండ్ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు చేరుకుని రైతులను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటారని వివరించారు. అనంతరం ఉ ల్లి రైతులను పరామర్శించి పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటిం చే వరకు రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని రైతులు, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. అర్జీదారులు నేరుగా కలెక్టర్ కార్యాలయానికి వచ్చే అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని, పరిష్కారం ఏ దశలో ఉందో కూడా తెలుసుకోవచ్చని సూచించారు.

ఆలయాలు మూసివేత

● సంప్రోక్షణ అనంతరం పూజలు


శ్రీశైల ఆలయ ద్వారాలు మూసివేస్తున్న ఆలయ అధికారులు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా జిల్లాలోని అన్ని ఆలయాలు ఆదివారం మధ్యాహ్నం 1గంటకు మూసివేశారు. ఆదివారం రాత్రి 9:56 చంద్రగ్రహణం ప్రారంభమై రాత్రి 1:26లకు ముగుస్తుందన్నారు. శ్రీశైల క్షేత్రంలో అర్జిత, పరోక్ష సేవలు, స్వామి అమ్మవార్ల కల్యాణం నిలిపివేశారు. శ్రీశైలంతో పాటు సాక్షిగణపతి, హఠకేశ్వరం, పాలధార, పంచధార, శిఖరేశ్వరం మొదలైన ఆలయాలలను కూడా మూసి వేశారు. శ్రీశైలంలో ఆలయాలను సోమవారం ఉదయం 5గంటలకు తెరిచి సంప్రోక్షణ జరిపించాక స్వామిఅమ్మవార్ల పూజలు జరిపించబడతాయని ఈవో శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలోని అన్ని ఆలయాలు సోమవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 2:15 గంటల వరకు, సాయంత్రం 5:30 నుంచి రాత్రి 9గంటల వరకు భక్తులందరికీ దర్శనం కల్పిస్తారు. ప్రధాన అర్చకులు శివప్రసాద్‌స్వామి, అర్చకస్వాములు, వేదపండితులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



ఇకపై కాస్మెటిక్ కిట్లు

● నగదు అందించే విధానానికి స్వస్తి
● వసతి గృహాలు, కేజీబీవీల్లో విద్యార్థులకు కిట్లు అందజేయనున్న ప్రభుత్వం
● కాస్మెటిక్స్ చార్జీలు పెంచడంపై హర్షం

నంద్యాల, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు వసతి గృహాల్లోని విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. వీటితో పాటు ఎక్కడిక్కడ ఆయా విద్యార్థులకు కాస్మెటిక్స్ అందించే నగదుకు స్వస్తి పలికి.. ప్రభుత్వం వాటిని కొనుగోలు చేసి ఆయా విద్యార్థులకు నగదు రూపంలో పలు రకాల కాస్మెటిక్ కిట్లను అందజేయనుంది. ఈ నేపథ్యంలో కాస్మెటిక్స్ రూపంలో జరిగే అవినీతి అక్రమాలకు అడుకట్ట వేసినట్లయింది. ఇదే క్రమంలో ప్రతి విద్యార్థికి కాస్మెటిక్ కిట్లను అందించి పారదర్శకత పాలనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లయింది. ఈ విధానంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో అన్నీ అవస్థలే..

వైసీపీ ప్రభుత్వంలో ఆయా వసతి గృహాల్లోని విద్యార్థులకు కాస్మెటిక్స్ పంపిణీకి స్వస్తి పలికి.. వాటి రూపంలో నగదు అందించే విధంగా చర్యలు తీసుకుంది. అయితే కొన్ని నెలలు పాటు ఈ ప్రక్రియ సాఫీగానే సాగింది. ఆ తర్వాత ఎప్పుడిస్తారో..? అనే పరిస్థితి నెలకింది. ఇదిలా ఉండగా.. నెలలు తరబడి కాస్మెటిక్స్ నగదును విడుదల చేయకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. అంతేకాకుండా తల్లిదండ్రులు ఖాతాల్లో జమ చేశామని ఒకసారి.. మూడు, నాలుగు నెలలకు కలిసి మొత్తం ఒకేసారి ఇస్తామంటూ ఇలా.. పలు రకాలుగా నెలలు తరబడి ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసింది. తద్వారా అప్పట్లో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో అలాంటి ఇబ్బందు లను గుర్తించి కూటమి ప్రభుత్వం కాస్మెటిక్స్ నగదు పంపిణీకి నేరుగా కాస్మెటిక్ కిట్లు పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీంతో విద్యార్థులకు స్థానికంగానే కాస్మెటిక్స్ అందించే విధంగా చర్యలు తీసుకోవడంతో విద్యార్థులకు కూడా ఎంతో ఉపయోగకరంగా మారినట్లయింది.



త్వరలోనే పంపిణీకి చర్యలు

ప్రభుత్వం కాస్మెటిక్స్ చార్జీలు పెంచి నేరుగా కాస్మెటిక్స్ కిట్లను పంపిణీ చేసేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఇది వరకే ప్రభుత్వం కొన్నింటికి సరఫరా చేసింది. మిగతా వాటికి కూడా రావాల్సి ఉంది. పూర్థిస్థాయిలో కిట్లు రాగానే పంపిణీ చేసేలా చూస్తాం.

ప్రేమంత్‌కుమార్. ఏపీసీ, ఎస్ఎస్ఏ

జిల్లాలో పరిస్థితి ఇలా...

కేటగిరి	వసతి గృహాల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
బీసీ	33	3820
ఎస్సీ	38	4125
ఎస్టీ(గురుకుల)	09	1900
కేజీబీవీలు	27	7025
మొత్తం	107	16,870

సరఫరా చేసే వస్తువులు ఇవే...

వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రభుత్వం ఈ నెలలోనే కాస్మెటిక్స్ కిట్లను పంపిణీ చేయనుంది. ఇందులో కొబ్బరి నూనె, టూత్ పేస్ట్, బ్రష్, పౌడర్ డబ్బా, షాంపూ, స్నానం సబ్బు, విద్యార్థులకు రుతు రుమాళ్లను అందజేస్తారు. అయితే ఒకేసారి రెండు నెలలకు సరిపడు సామగ్రినికి అందజేయనున్నారు.

చార్జీల పెంపు ఇలా...

పలు వసతి గృహాల్లోని విద్యార్థుల పరంగా.. మూడు నుంచి ఆరో తరగతి వరకు బాలురకు నెలకు రూ. 100 నుంచి రూ. 125.. బాలికలకు రూ. 110 నుంచి రూ. 130 వరకు పెంచింది. ఏడో తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలురకు రూ. 125 నుంచి రూ. 150, బాలికలకు రూ. 160 నుంచి రూ. 200, ఇంటర్మీడియట్ ఆపై స్థాయి బాలురకు రూ. 125 నుంచి రూ. 200, బాలికలకు రూ. 160 నుంచి రూ. 250 వరకు పెంచింది. ఈ ప్రకారం ఆయా విద్యార్థులకు కాస్మెటిక్స్ సామగ్రిని కొనుగోలు చేసి కిట్ల రూపంలో అందజేయనున్నారు. ఇదిలా ఉండగా.. బాలుర హెయిర్ కటింగ్‌కు రూ. 30 నుంచి రూ. 50కి పెంచింది.


కర్నూలు మార్కెట్ యార్డులో రూ.2 కోట్లు ఖర్చు చేసి అసంపూర్తిగా వదిలేసిన ఉల్లి శీతల గిడ్డంగులు

కోల్డ్ స్టోరేజీకి మోక్షమెన్నడో..?

● రూ.5 కోట్లతో ఉల్లి శీతల గిడ్డంగి నిర్మాణానికి శ్రీకారం
● సామర్థ్యం 5 లక్షల మెట్రిక్ టన్నులు
● వైసీపీ హయాంలో అసంపూర్తిగా వదిలేసిన వైనం
● నిర్మాణం పూర్తయి ఉంటే ఉల్లి రైతులకు వరం

ఉల్లి రైతులకు కష్టాలు తప్పడం లేదు. ధరలు పతనమై పంట దిగుబడులు రోడ్లపై పారబోసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆ కష్టాలు తీరాలంటే ధర లేనప్పుడు శీతల గిడ్డంగుల్లో నిల్వ చేయాలి. ధర ఉన్నప్పుడు అమ్ముకొని రైతు లాభ పడాలనే సంకల్పంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 5 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంలో శీతల గిడ్డంగి (కోల్డ్ స్టోరేజీ) నిర్మాణం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం రూరల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఆర్‌డీఎఫ్) నిధులు రూ.5 కోట్లు ఇచ్చింది. సగం పనులు పూర్తి అయ్యాయి. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. ఐదేళ్లు అసంపూర్తిగా వదిలేశారు. గత పాలకుల నిర్లక్ష్యం ఉల్లి రైతులకు శాపమై వెంటాడుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా పనులు చేపట్టలేదు. ఆనాడే శీతల గిడ్డంగి నిర్మాణం పూర్తి చేసి ఉంటే ఈ రోజు ఉల్లి పంట అమ్ముకోవడానికి రైతులకు ఇన్నీ కష్టాలు వచ్చేవా..? కోల్డ్ స్టోరేజ్ గోదాములో నిల్వ చేసి ధర వచ్చినప్పుడే అమ్ముకునే అకాశం ఉండేది. ఆ వివరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కర్నూలు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులు రోజువారి (రెగ్యులర్)గా పత్తి, ఉల్లి, మిరప, వేరుశనగ, వాము, కంది.. వంటి పంట ఉత్పత్తులు క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. పత్తికొండ మార్కెట్ యార్డులో సీజన్‌లో టమోటా క్రయ విక్రయాలు సాగిస్తున్నారు. ఆలూరు, మంత్రాలయం (కోసిగి), కోడుమూరు మార్కెట్‌లో పంట ఉత్పత్తులు విక్రయాలు జరగడం లేదు. ఆయా మార్కెట్లలో ప్రతి ఏటా సరాసరి రూ.3,500 కోట్ల నుంచి రూ.4,500 వేల కోట్ల వరకు విలువైన పంట ఉత్పత్తులు రైతులు అమ్మకానికి తీసుకొస్తున్నారు. ఒక శాతం సెస్సు రూపంలో ఈ ఏడాది రూ.35-45 కోట్లు ఆదాయం వస్తోంది. కర్నూలు మార్కెట్ యార్డు ఉల్లి క్రయవిక్రయాలకు ప్రసిద్ధి. అయితే.. రెండేళ్లకు ఒకసారి ధరలు పతనమై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. 2022, 2023లో ఉల్లి ధరలు పడిపోయాయి. గత ఏడాది క్వింటా రూ.5 వేలకు పైగా పలికింది. ఈ ఏడాది పూర్తిగా పతనమై రూ.450 నుంచి రూ.500కు కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంది. దశాబ్దాలుగా ఉల్లి రైతులు ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ కష్టాలు తీరాలంటే పంట నిల్వ చేసుకోవడానికి శీతల గిడ్డంగులు ఎంతో అవసరం.

రూ.5 కోట్లు.. 5 లక్షల టన్నుల సామర్థ్యం

కర్నూలు మార్కెట్ యార్డుకు ఏటా రూ.850-900 కోట్లు విలువైన వ్యవసాయ పంట దిగుబడులు రైతులు మార్కెట్‌కు అమ్మకానికి తీసుకొస్తున్నారు. రూ.8.5 కోట్లు వరకు సెస్సు రూపంలో మార్కెట్‌కు ఆదాయం వస్తుంది. అందులో ఉల్లి విక్రయాలు ద్వారానే ఏడాదికి రూ.1.50-2 కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. రాయలసీమ జిల్లాల్లో ఏకైక ఉల్లి మార్కెట్ ఇది. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలు, సరిహద్దున తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ఉల్లి దిగుబడులు తీసుకొస్తున్నారు. గిట్టుబాటు ధర లేక.. లారీ బాడుగులు కూడా గిట్టుబాటు కాక రైతులు ఉల్లిని రోడ్లపై పారబోసిన వెళ్లిన సందర్భాలు లేకపోలేదు. మద్దతు ధర లేనప్పుడు ఉల్లి నిల్వ చేసి.. మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవడానికి అవకాశం కల్పించాలనే లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం హయాంలో 2016-17లో 5 లక్షల మెట్రిక్ టన్నుల ఉల్లి దిగుబడులు నిల్వ చేసేందుకు వీలుగా శీతల గిడ్డంగులు (కోల్డ్‌స్టోరేజ్) నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. కేంద్ర ప్రభుత్వం రూరల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఆర్డీఎఫ్) నిధులు రూ.5 కోట్లు మంజూరు చేసింది. రూ.2.40 కోట్లు ఖర్చు చేసి సగానికి పైగా పనులు పూర్తి చేశారు. గోడలు, శీతలీకకరణ పనులు చేపడితే సరిపోతుంది. అదే జరిగితే ఉల్లి రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. పనులు పూర్తయ్యే దశలో ఉండగా, 2019లో టీడీపీ ప్రభుత్వం స్థానంలో వైసీపీ ప్రభుత్వం కొలుదీరింది. ఈ పనులు చేస్తే ఎక్కడ చంద్రబాబుకు రైతుల్లో మంచి పేరు వస్తుందో..? అని జగన్ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యంగా వదిలేశారు. ఐదేళ్లలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు నెలల క్రితం 2025-26 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం బ్యాలెన్స్ పనులు పూర్తి చేసేందుకు రూ.5 కోట్లు నిధులు కావాలని ప్రతిపాదనలు పంపించారు. నిధులు వస్తాయా..? పనులు మొదలు పెడుతారా..? అన్నది ప్రశ్నార్థకమే.

శీతల గిడ్డంగితో తీరుతున్న రైతుల కష్టాలు

ఉల్లికి కుళ్లిపోయే గుణం ఎక్కువ. దీంతో ఎప్పటికప్పుడు గ్రేడింగ్ చేయాల్సి ఉంటుంది. ఏ రోజు వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొచ్చే ఉల్లిని అదే రోజు కొనుగోలు చేసి వ్యాపారులు బహిరంగ వ్యాణిజ్య మార్కెట్లకు ఎగుమతి చేయాల్సి ఉంటుంది. రెండు మూడు రోజులు ఆగిపోతే కుళ్లిపోయే ప్రమాదం ఉంది. జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చసే ఉల్లి పంట ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కోతకు వస్తుంది. జిల్లాలో దాదాపు 31 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఎకరాకు సరాసరి 80 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని ఉద్యానవన శాఖ అధికారులు అంచనా. ఈ లెక్కన ఏడాదికి 24.80 లక్షల క్వింటాళ్లు (2.48 లక్షల టన్నులు) ఉల్లి దిగుబడులు వస్తాయని ఉద్యానవన శాఖ అధికారులు అంచనా. కర్నూలు మార్కెట్ యార్డు ఉల్లి లైసెన్సుడ్ వ్యాపారుల 15 మందికి మించి వ్యాపారం (ట్రేడింగ్) చేస్తున్నారు. రోజుకు సగటున 8-10 వేల క్వింటాళ్లకు మించి కోనుగోలు చేసే సామర్థ్యం లేదు. దీనికి తోడు రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా, తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా రైతులు ఉల్లి తీసుకొస్తున్నారు. ఆ స్థాయిలో వ్యాపారులు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంది. ఫలితంగా ధరలు పతనమై రైతులు నష్టపోతున్నారు. అదే శీతల గిడ్డంగులు ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని ఓ వ్యాపారి పేర్కొనడం కొసమెరుపు. కర్నూలు ఉల్లి కోల్‌కతా, తమిళనాడు, కేరళ, గుజరాత్ ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తున్నారు. కోల్‌కతా నుంచి బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేసేవారు. ఎగుమతి ఆపేయడంతో ధరలు పడిపోయి రైతులకు నష్టం తప్పడం లేదు. ధరల విపత్తుల నుంచి ఉల్లి రైతులు గట్టెక్కాలంటే అసంపూర్తిగా ఆపేసిన శీతల గిడ్డంగులు తక్షణమే పూర్తి చేసే వచ్చే ఏడాది నుంచైనా రైతులకు వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అసంపూర్తిగా జంబో షెడ్డు

కర్నూలు మార్కెట్ యార్డులో వేరుశనగ, వాము, కంది, పప్పు శనగ.. వంటి పంట దిగుబడులు క్రయ విక్రయాల కోసం మార్కెట్ ఆఫీసుకు ఎదురుగానే రూ.2.50 కోట్లతో జంబో షెడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. 80 శాతం పూర్తి చేసినా డ్రైన్లు, సిమెంట్ ప్లాస్టింగ్.. వంటి పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

ప్రతిపాదనలు పంపించాం

కర్నూలు మార్కెట్‌లో ఉల్లి శీతల గిడ్డంగులు అసంపూర్తిగా ఉన్న మాట నిజమే. ప్రభుత్వానికి నివేదిక పంపించాం. బ్యాలెన్స్ పనులు పూర్తి చేయడానికి రూ.5 కోట్లు నిధులు అవసరం ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణాలు మొదలు పెడుతాం.

● జయలక్ష్మి, స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి, కర్నూలు మార్కెట్ యార్డు

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: మంత్రి ఫరూక్


చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, అజాగ్రత్తగా ఉండకుండా జాగ్రత్తగా ఉండాలని న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం రూ.28 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ పేద ప్రజలు వైద్య పరంగా స్థోమతకు మించి ఖర్చు చేయాల్సి వచ్చినప్పుడు పార్టీ కార్యాలయంలో తెలియజేయాలని కోరారు. 29 మందికి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించానని తెలిపారు. 29 మందికి రూ.29 లక్షలు బాధిత కుటుంబ సభ్యులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో సీఎం చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారన్నారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్, నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్ హరిబాబు, గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్‌రెడ్డి, ఎన్ఎండీ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో జరిగిన ఫారెస్టు సబార్డినేట్ సర్వీస్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిసాయని డీఆర్వో వెంకట నారాయణమ్మ తెలిపారు. జిల్లాలో 33 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన సెషన్స్‌లో 12,919 అభ్యర్థులకు గానూ 10,820 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మూడు పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగిన సెషన్స్‌లో 2,255 మంది అభ్యర్థులకు గానూ 1,831 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.

1,200 మెట్రిక్ టన్నుల ఉల్లిని కొన్నాం

● మార్క్‌ఫెడ్ డీఎం రాజు

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో రైతుల నుంచి 1200 మెట్రిక్ టన్నుల ఉల్లిని కొనుగోలు చేశామని మార్క్‌ఫెడ్ డీఎం రాజు తెలిపారు. ఆదివారం కర్నూలు మార్కెట్ యార్డులో జంబో మార్కెట్ గోదాములోని ఉల్లి నిల్వలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గోదాములో నిల్వ ఉంచిన ఉల్లిని త్వరగా బయటకు సప్లయ్ చేసే కార్యక్రమంలో భాగంగా ఆదివారం అమ్మకానికి వేలం నిర్వహించామన్నారు. ఈవేలంలో హోటళ్లు, విద్యాసంస్థల హాస్టళ్లు తదితర సంస్థల యజమానులు 150 టన్నుల దాకా ఉల్లిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇకపై వేలం పాటలను నిరంతరం నిర్వహించి రైతుల నుంచి సేకరించిన ఉల్లిని అమ్మేందుకు నిర్ణయించామని స్పష్టం చేశారు.

ఫిజియోథెరపీతో సాంత్వన 7
మార్కెట్‌కు తీసుకొచ్చిన ఉల్లి మొత్తం కొనుగోలు చేస్తాం

ఫిజియోథెరపీతో సాంత్వన

ప్రస్తుతం ప్రజల జీవనశైలి మారింది. ప్రతి రోజూ ఉరుకులు, పరుగులు తీయాల్సిన పరిస్థితి. భుజం, మెడ, నడుము, మోకాలి నొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరగుతోంది. దీంతో దుష్ఫలితాలు వచ్చే మందుల కంటే ఫిజియోథెరపీ మేలని వైద్యులు సూచిస్తున్నారు. ఫిజియోథెరపిస్టుల ప్రాధాన్యం పెరిగింది. ఈ ఏడాది ప్రపంచ ఫిజియోథెరపీ సమాఖ్య ఆరోగ్యకరమైన ముడిపడిన వృద్ధాప్యం అన్న నినాదాన్ని ఇచ్చింది. వృద్ధాప్యాన్ని ఆరోగ్యంగా తీర్చిదిద్దడంలో ఫిజియోథెరపీ, శారీరక చురుకుదనం ప్రాధాన్యతను తెలియజేసింది. నేడు వరల్డ్ ఫిజియోథెరపీ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం..



- పెరుగుతున్న ఆదరణ
- చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఉపశమనం
- నేడు వరల్డ్ ఫిజియోథెరపీ డే

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీ అనేది మందులు లేకుండా, శారీరక వ్యాయామాల ద్వారా రోగాలను నయం చేసే ఒక ముఖ్యమైన వైద్య విధానం. 1996 నుంచి వరల్డ్ ఫిజియోథెరపీ డేను నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో ఫిజియోథెరపి వైద్య విధానానికి ఆదరణ పెరిగింది. క్లినిక్‌లు పెరిగాయి. కోవిడ్ సమయంలో ఫిజియోథెరపిస్టులకు ఎంతో గుర్తింపు వచ్చింది. మందులతో పని చేయకుండా ఇళ్లవద్ద కూడా ఉండే కొన్ని రకాల వ్యాయమాలు చేయడం ద్వారా చాలా రకాల నొప్పులను నయం చేయడంతో పాటు కొన్నిరకాల వ్యాధుల నుంచి కూడా బాధితులకు విముక్తి లభిస్తుండటంతో ఫిజియోథెరపీపై ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు.



అన్ని విభాగాల్లో సేవలు

న్యూరోసర్జరీ, న్యూరాలజీ, పీడియాట్రిక్, గైనకాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, ఈఎన్‌టీ, ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, ఆర్థో విభాగాల్లో చికిత్స పొందుతున్న రోగులకు ఫిజియోథెరపీ అవసరం ఉంటుంది. కొన్ని రకాల కేసులకు మూడు నెలలు, మరికొన్ని రకాల కేసులకు ఆరు నెలల్లో కోలుకునే అవకాశాలుంటాయి. క్రీడాకారులు ఆటలాడే సమయంలో కండరాల నొప్పులు రాకుండా మెడికల్ ట్యాపింగ్ పద్ధతిని వినియోగిస్తున్నారు. ఒక వేళ ఆటలాడే సమయంలో దెబ్బలు తగిలితే తక్షణమే నొప్పిని, వాపును తగ్గించేందుకు ఈ పద్ధతి ఎంతో ఉపయోగపడుతుంది. పెయిన్‌లెస్ డెలివరీలు చేయడం, కాన్పు తర్వాత వచ్చే కాంప్లికేషన్స్ లేకుండా నివారించడంలో వీరి పాత్ర కీలకంగా మారింది. చిన్న పిల్లల్లో వచ్చే శారీరక ఎదుగుదల లోపాలు, సరి చేయడం క్యాన్సర్ రోగులకు నొప్పి నివారణలోనూ వీరి సేవలను వినియోగిస్తున్నారు.



ప్రతి రోజూ 190 మంది రోగులు..

కర్నూలు జీజీహెచ్‌లోని ఫిజియోథెరపీ విభాగం (ఓపీ నెంబర్.41)లో పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నాం. ఆర్థో, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, గైనిక్ వంటి ముఖ్యమైన విభాగాల నుంచి ప్రతిరోజూ 170 నుంచి 190 మంది రోగులు వచ్చి సేవలు పొందుతుంటారు. అన్ని వయస్సులోని ప్రజలు చురుకుగా, ఆరోగ్యంగా ఉండటానికి ఫిజియోథెరపి ఎంతో దోహదపడుతుంది.

- డాక్టర్ పి.లావణ్య, ఫిజియోథెరపిస్టు, జీజీహెచ్, కర్నూలు





నొప్పుల నివారణలో కీలకపాత్ర

కండరాల బలహీనతలతో కూడిన నొప్పులను మందులతో తాత్కాలికంగా తగ్గించొచ్చు. అవి మళ్లీ మళ్లీ వస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఫిజియోథెరపీ కీలకపాత్ర పోషిస్తుంది. నొప్పిఉన్న ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించి అవసరమైన శారీరక, వ్యాయామాలతో పాటు సహాయక చికిత్సను అందించవచ్చు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా నడక, వ్యాయామం చేయాలి.

- డాక్టర్ అర్షద్, ఫిజియోథెరపిస్టు, కిమ్స్, కర్నూలు

13న కర్నూలులో జాబ్ మేళా

- కరపత్రాన్ని ఆవిష్కరించిన మంత్రి భరత్



కరపత్రాలను అవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో ఈనెల 13న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో 21 బహుళ జాతీయ కంపెనీలు వస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎల్ ఆనంద్ రాజ్‌కుమార్, ప్లేస్ మెంట్ ఎగ్జిక్యూటివ్ సాయి తేజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గోనెగండ్ల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని పెద్దమరివీడు గ్రామంలో చోటుచేసుకున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన బోయ చంద్రన్న(65)కు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు కూలీ పనులు చేసి జీవనం సాగించేవారు. ఐదేళ్లుగా బోయ చంద్రన్న ఆయాసం, ఉబ్బసం వ్యాధితో బాధపడు తుండే వాడు. పలు చోట్ల వైద్యం చేయించినప్పటికీ వ్యాధి నయం కాలేదు. రెండు రోజులుగా ఆయాసం ఎక్కువైంది. దీంతో జీవితంపై విరక్తి చెందాడు. శనివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో బాత్ రూమ్‌కు వెళ్లి అక్కడ దోమల మందును తాగి స్పృహకోల్పోయాడు. కుటుంబసభ్యులు హుటాహుటిన ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య సేవల కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి బలవన్మరణం

మహానంది, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగి ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన వనం మధు(21) అనే యువకుడు కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. ఆదివారం మద్యంలో పురుగుమందు కలుపుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానాలు ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపటి లోపు ఎంట్రీలు నమోదు చేసుకోవాలి

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈనెల 9వ తేదీ సాయంత్రం 6గంటల్లోపు ఏపీ చెస్ వెబ్‌సైట్లో తమ ఎంట్రీలు నమోదు చేసుకోవాలని జిల్లా చెస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డా.రవికృష్ణ, రామసుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. నంద్యాల పట్టణంలో ఈ నెల 13, 14తేదీల్లో ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల చెస్ సంఘం, ఎస్ఆర్‌జీ చెస్ అకాడమి నిర్వహణలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నా మన్నారు. జాతీయస్థాయి చెస్ పోటీల్లో పాల్గొనే రాష్ట జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఈ పోటీలు రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నిర్వహి స్తామన్నారు. ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో చెస్ పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులకు భోజన, వసతితోపాటు జ్ఞాపికలను అందజేయనున్నట్లు వారు తెలిపారు. వివరాలకు సెల్ నెంబర్: 9010451585ను సంప్రదించాలని సూచించారు.

ఇరు వర్గాల ఘర్షణ

ఏడుగురికి తీవ్ర గాయాలు.. 30 మంది పై కేసు నమోదు

గోనెగండ్ల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఐరన్‌బండ గ్రామంలో ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఓ విషయంలో మునెప్ప నాగేష్‌ను శనివారం ఉదయం మందిలించాడు. దీన్ని మనసులో పెట్టుకున్న నాగేష్ తన కుటుంబసభ్యులు, వర్గీలయుతో కలిసి రాత్రి మునెప్ప కుటుంబ సభ్యులు, వర్గీయులపై కంట్లో కారం చల్లి కట్టెలు, రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో మునెప్పతో పాటు హనుమంతు, చిన్న పెద్దయ్య, పెద్దపెద్దయ్య, నాగరాజు, రాముడు, రామయ్యలకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. మరో ముగ్గురి మహిళలకు ముకి దెబ్బలు తగిలాయి. గాయాల పాలైన వారిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగేష్ వర్గీయులపై మునెప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే బోయ నాగేష్ తండ్రి బోయ పాండురంగడు తన కూమారుడైన బోయ నాగేష్ పై అన్యాయంగా దాడికి మునెప్ప వర్గీయులు పాల్పడినారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరు వర్గాల ఫిర్యాదు పై విచారణ జరిపి మునెప్ప ర్గానికి చెందిన 14 మందిపై.. పాండురంగడు వర్గానికి చెందిన వారిపై 16 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు.

కేసీఆర్ బలమైన నాయకుడు

- తెలంగాణ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్
- శ్రీశైలంలో ప్రత్యేక పూజలు



మాట్లాడుతున్న దాసోజు శ్రవణ్

శ్రీశైలం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ ఒక బలమైన నాయకుడని తెలంగాణ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. ఆదివారం శ్రీశైలం చేరుకున్న ఆయన స్వామిఅమ్మవార్ల దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రవణ్ మాట్లాడుతూ కేసీఆర్ దంపతులు ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి అమ్మవారికి పూజలు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షోభాలు, సమస్యలు ఎన్ని వచ్చినా వాటిని కేసీఆర్ అధిగమించి మళ్లీ సీఎం అవుతారని ధీమా వ్యక్తంచేశారు. ఎవరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోట్లు పొడిచినా కేసీఆర్ వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటారన్నారు. తెలంగాణ రైతాంగం చాలా ఇబ్బందుల్లో ఉన్నారని, యూరియా సమస్యను ప్రభుత్వం ముందస్తుగా అంచనా వేసిఉంటే సమస్య వచ్చేది కాదన్నారు. యాదాద్రి దేవాలయం అభివృద్ధి మాదిరే శ్రీశైలం అభివృద్ధికి కూడా సహకారం అందిస్తారన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం అభినందనీయం



డీఈవో శామ్యూల్ పాల్, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యతో సత్కార గ్రహీతలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కవులు, కళాకారులైన ఉపాధ్యాయులను సత్కరించడం అభినందనీయమని డీఈవో శామ్యూల్ పాల్ అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, సాహిత్యం, కళలు, నాటక రంగంలో రాణిస్తున్న 15 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఘనంగా సత్కరించారు. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో విచ్చేశారు. గత సంవత్సరం పది ఫలితాలను 62 శాతం నుంచి 89 శాతానికి పెంచిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. అధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ప్రస్తుతం సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయులు సాహిత్యంలో, కళా, నాటక రంగాల్లో రాష్ట్రస్థాయిలో పేరొందిన వారిగా గుర్తింపు తెచ్చుకున్నారని అభినందించారు. అంతకు ముందు ఇటీవల మరణించిన రెండు నంది పురస్కారాల గ్రహీత, కళాక్షేత్రం శాశ్వత సభ్యుడు వన్నెం బలరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విశ్రాంత ఎంఈవో పి. రాజారత్నం, విశ్రాంత హెచ్‌ఎం, గజల్ గాయకుడు మహమ్మద్ మియా, కళాక్షేత్రం కార్యదర్శి సి. యాగంటీశ్వరప్ప, సభ్యులు కేవీ రమణ, జీవీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అవోపా విద్యానిధి' సేవలు మరువలేనివి: టీజీ



ఉపకారవేతనాలు అందుకున్న విద్యార్థులతో టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాతికేళ్లుగా అవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) సంస్థ నిర్వహిస్తున్న సేవలు మరువలేనివని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ప్రశంసించారు. అవోపా విద్యానిధి ద్వారా ఎదిగిన విద్యార్థులు భవిషత్తులో తగిన చేయూత అందించి మరింత అభ్యున్నతికి కృషి చేయాలని ఆయన కోరారు. ఆదివారం నగరంలోని సుంకేసుల రోడ్డులోగల అవోపా సేవాసదన్‌లో అవోపా విద్యానిధి రజతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా టీజీ వెంకటేశ్ విచ్చేశారు. ఆయనకు అవోపా ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం టీజీ వెంకటేశ్ అవోపా విద్యానిధి రజతోత్సవ లోగోను ఆవిష్కరించారు. తర్వాత ఆయన ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అలాగే రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా నియమితులైన ఆర్యవైశ్య ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష గొప్పదనాన్ని తెలియజేస్తూ చక్కటి వేషధారణలతో ప్రదర్శన నిర్వహించిన ఆర్యవైశ్య మహిళలను ఆయన అభినందించారు. టీజీ మాట్లాడుతూ అవోపా విద్యానిధి ద్వారా సహాయం పొందిన వారు జీవితంలో స్థిరపడ్డాక మరింత మంది చదువుకునేలా తమ సహకారం అందించాలని సూచించారు. హైదరాబాదులోని ఆర్యవైశ్య హాస్టల్‌లో చదివిన షైహోమ్స్ అధినేత ముందుకు వచ్చారని గుర్తు చేశారు.

- నగరంలోని అవోపా సేవాసదన్‌లో జరగిని అవోపా విద్యానిధి రజత్సోత వేడుకల్లో పరిశ్రమశాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రజతోత్సవ లోగోను ఆవిష్కరించారు. అనంతరం ప్రతిభ చూపిన ఆర్యవైశ్య విద్యార్థులకు ఆర్థిక సహాయంతోపాటూ ప్రతిభా పురస్కారాలు అందజేశారు. రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా నియమితులైన ఆర్యవైశ్యులను మంత్రి అభినందించారు.

నంద్యాలకు చేరుకున్న 'ఇస్కాన్' పాదయాత్ర

- ఘన స్వాగతం పలికిన భక్తులు
- అబ్బురపరుస్తున్న ఎద్దుల జతలు



స్వామివారి రథం

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ ఆధ్వర్యంలో చేపట్టిన భారతదేశ పాదయాత్ర ఆదివారం నంద్యాలకు చేరుకుంది. ఇస్కాన్ ఆల్ ఇండియా అధ్యక్షులు స్వామిజీ శ్రీమాన్ ఆచార్య ఆధ్వర్యంలో 25 మంది సభ్యుల బృందం నంద్యాలకు మొదటి సారి వచ్చింది. గతంలో ఆరు పర్యాయాల పాటు దేశ పాదయాత్ర చేపట్టినా నంద్యాలకు చేరుకోవడం ఇదే మొదటిసారి. 7వ పర్యాయం కేదర్‌నాథ్ నుంచి ప్రారంభించిన యాత్ర ప్రతిరోజు 10 కిలోమీటర్ల ప్రయాణం చేస్తూ బద్రినాథ్, ద్వారకా, పూరి, శ్రీ కూర్మం, మంగళగిరి, గుంటూరు, మార్కాపురం, గిద్దలూరు మీదుగా ఇక్కడికి చేరుకున్నారు. అయ్యలూరు మెట్ట వద్దకు చేరుకోగానే నంద్యాల ఇస్కాన్ ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా స్వాగ తం పలికారు. పట్టణంలో ప్రజలకు మహా హరినామ సంకీర్తన నిర్వహించారు. ద్వారకానగరం నుంచి తెచ్చిన ఎద్దుల బండ్లపై యాత్ర కొనసాగుతోంది. బృందావనం, మాయాపురం పేర్లు కలిగిన ఎద్దులు ప్రజలను అబ్బురపరుస్తున్నాయి.

సనాతన ధర్మాన్ని వివరిస్తూ..



సనాతన ధర్మాన్ని పట్టణ, గ్రామీణ ప్రజలకు వివరిస్తూ భాగవత, రామాయణాల పుస్తకాలను పంపిణీ చేస్తూ యాత్ర కొనసాగుతోంది. నంద్యాల నుంచి అహోబిలం చేరుకుని, అక్కడి నుంచి తిరుపతి, రామేశ్వరం మీదుగా కన్యాకుమారికి చేరుకుంటుందన్నారు.

- అమలనిమయ్‌దాస్, శ్రీశైలం, మార్కాపురం జనరల్ మేనేజర్, ఇస్కాన్

ఒకే రోజు మూడిళ్లలో చోరీ

- బంగారు, వెండి, నగదు అపహరణ

మంత్రాలయం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకేరోజు మూడిళ్లలో చోరీ జరిగినట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. వివ రాలు.. సుంకేశ్వరి గ్రామంలో చాకలి సత్తెన్న చెందిన రెండు ఇళ్లల్లో వేరువేరు బీరువాలను పగులకొట్టి నాలుగు తులాల బంగారు, రూ.20వేల నగదు, మరో బీరువాలో రూ.2లక్షల నగదు చోరీకి గురైంది. చాకలి గోవిందు ఇంట్లో నగదు, బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. వీరు ఇంటికి తాళాలు వేసుకుని బెంగుళూరులో వలస వెళ్లి అక్కడే నివాసం ఉంటున్నారు. ఇంటి వద్దనే వృద్ధ తల్లిదండ్రులు ఉండేవారు. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సత్తెన్నకు చెందిన రెండు బీరువాలు, చాకలి గోవిందుకు చెందిన మరో బీరువా, తలుపులను పగులకొట్టి ఇంట్లో ఉన్నదంతా దోచుకెళ్లారు. కొన్ని పత్రాలను, ట్రంకు పెట్టెను ఊరుబయట పొలాల్లో పడేసి వెళ్లారు. తెల్లారిసరి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో చాకలి సత్తెన్న, సర్పంచ్ ముకురన్న పోలీసులకు సమాచారం ఇచ్చారు. మాధవరం ఎస్ఐ విజయకుమార్ ఘటనాస్థలికి చేరుకొని చోరీ జరిగిన తీరు పరిశీలిం చారు. కర్నూలుకు చెందిన క్లూస్ టీం అధికారులు వేలిముద్రలు సేకరించారు. ఖగ్గల్లు గ్రామంలో బోయ వీరేష్ అనే వ్యక్తి రోజూ రాయచూరు వెళ్లి కూలి పనులు చేస్తూ జీవనం చేసేవారు. అదేరోజు రాత్రి అతడికి చెందిన మరో ఇంట్లో నిద్రించాడు. కాస్త దూరంలో ఉన్న ఇంట్లో 2 తులాల బంగారు, 50 తులాల వెండి, రూ.30వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు వాపోతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఒకే రోజు రెండు గ్రామాల్లో మూడు చోరీలు జరగడం మాధవరం పోలీసులకు సవాల్‌గ మారింది. ఆరు నెలలుగా ఇదే పోలీస్‌స్టేషన్ పరిధిలో రచ్చుమర్రి, తుంగభద్ర, మాధవరం ప్రాంతాల్లో చోరీలు జరుగుతూనే ఉన్నాయి. పోలీసులు సీసీ పుటేజీలు, వాహనాల నెంబర్ల ఆధారంగా నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చేపట్టారు.

శ్రీశైలంలో చిరుత కలకలం

శ్రీశైలం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో పాతాళగంగ మెట్ల పంప్‌హౌస్ సమీపంలో శనివారం రాత్రి చిరుత సంచారం కలకలం రేపింది. సమీపంలో నివాసము టున్న ఫక్కీరయ్య అనే వ్యక్తి ఇంటి పరిసర ప్రాంతాల్లో సంచరించడం గమనించారు. కేకలు వేయడంతో చిరుత పరుగులు తీసింది. సమాచారం తెలుసుకున్న సున్నిపెంట అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ మదన్ ఘటనాస్థలికి చేరుకున్నరు. వివరాలు అడిగి తెలుసుకొని ప్రజలను అప్రమత్తం చేశారు. రాత్రి వేళలో చిరుత సంచరిస్తుండటాన్ని గుర్తించి అటవీశాఖ సిబ్బందితో గస్తీ ఏర్పాటుచేశారు.

మార్కెట్‌కు తీసుకొచ్చిన ఉల్లి మొత్తం కొనుగోలు చేస్తాం

- కనీస మద్దతు ధర రూ.1,200 అందిస్తాం
- అంతకంటే తక్కువకు ధర పలికితే వ్యత్యాసం డబ్బు ఖాతాలో జమ చేస్తాం
- కలెక్టరు రంజిత్‌బాషా



సమావేశంలో పాల్గొన్న ఎస్పీ, కలెక్టరు

కర్నూలు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు కర్నూలు మార్కెట్‌కు తీసుకొచ్చే ప్రతి కిలో ఉల్లి గడ్డలు కొనుగోలు చేస్తామని, ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషా భరోసా ఇచ్చారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌లో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.1,200లు ప్రకటించిందని తెలిపారు. వ్యాపారులు ఎంత రేటుకైతే కొలుగోలు చేస్తారో, మిగిలిన మొత్తం బోనస్ రూపంలో రైతుల ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. ఉదాహరణకు వ్యాపారి క్వింటా రూ.250లకు కొనుగోలు చేస్తే, మిగిలిన వ్యత్యాసం అమౌంట్ రూ.950 ప్రకారం లెక్కకట్టి రైతులకు ఖాతాలో జమ చేస్తామని అన్నారు. జిల్లాలో 31 వేల ఎకరాల్లో ఉల్లి సాగు చేశారని తెలిపారు. ఇప్పటికే ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా 1,226 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. శనివారం ఒక్క రోజే 1600 టన్నులు మార్కెట్‌కు వచ్చిందని గుర్తు చేశారు. మార్కెట్‌కు తీసుకొచ్చిన ప్రతి గడ్డను కొనుగోలు చేస్తామని, అధైర్యపడాల్సిన అవసరం లేదని వివరించారు. ఉల్లి రైతులకు తప్పుడు సంకేతాలు ఇస్తూ సోషల్ మీడియాలో కొందరు చేసే ఫేక్ ప్రచారాలు, వదంతులు నమ్మవద్దని వివరించారు. మార్కెట్‌కు ఉల్లి తీసుకొచ్చే సమయంలో ఆరబెట్టి, గ్రేడింగ్ చేసి తీసుకొస్తే మంచి ధర వస్తుందని తెలిపారు. అలాగే.. జిల్లాలో యూరియా సమస్య లేదన్నారు. ప్రస్తుతం జిల్లాలో 3,200 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. మరో రెండు రోజుల్లో 2,600 టన్నులు యూరియా వస్తుందన్నారు. నానో యూరియాను కూడా వినియోగించుకోవాలని కలెక్టరు రైతులకు సూచించారు. గత ఏడాది 56 వేల టన్నులు వివిధ రకాల రసాయన ఎరువులు సరఫరా చేస్తే, ఈ ఏడాది 64,746 టన్నులు సరఫరా చేశామన్నారు. రబీ కోటా మళ్లీ వస్తుందని, ఇప్పుడే కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని సూచించారు. యూరియా అక్రమ రవాణా చేసిన ఐదుగురిపై కేసులు నమోదు చేశామన్నారు. రూ.1.50 కోట్లు విలువైన యూరియా సీజ్ చేశామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు సత్వర పరిష్కారానికే పల్లెకు పోదాం కార్యక్రమం చేపట్టామని తెలిపారు. తొలి రోజు 79 గ్రామాలకు ప్రత్యేక అధికారులు వెళ్లి పలు సమస్యలు గుర్తించారు. ఆర్థిక పరమైన, డబ్బు లేకుండా పరిష్కరించే సమస్యలు గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఒక్క రోజులో 25 సమస్యలు పరిష్కరంచినట్లు కలెక్టరు రంజిత్‌బాషా తెలిపారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ మాట్లాడుతూ యూరియా అక్రమ రవాణా అరికట్టేందుకు విజిలెన్స్ పోలీసులు సరిహద్దుల్లో పక్కా నిఘా పెట్టామని తెలిపారు. ఉల్లి విక్రయాలపై తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని సూచించారు.

మార్కెట్‌ను సందర్శించిన కలెక్టరు, ఎస్పీ : కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డును కలెక్టరు పి.రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జాయింట్ కలెక్టరు బి.నవ్య పరిశీలించారు. వివిధ గ్రామాల నుంచి రైతులు తీసుకొచ్చిన ఉల్లి దిగుబడులు పరిశీలించారు. ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లి నిల్వలను తనిఖీ చేశారు. సీఎం చంద్రబాబు ఉల్లికి కనీస మద్దతు ధర రూ.1,200లు ప్రకటించారని, వ్యాపారులు అంతకంటే తక్కువకు కొనుగోలు చేస్తే, ఆ వ్యత్యాసం అమౌంట్‌ను రైతుల ఖాతాలో జమ చేస్తామని, మార్కెట్ అధికారులు టోకన్లు ఇస్తారని కలెక్టరు రైతులకు వివరించారు. వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, మార్కెట్‌యార్డు సెక్రెటరీ జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

హిందువుల మనోభావాలను దెబ్బతీయవద్దు

● బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు



సమావేశంలో మాట్లాడుతున్న అభిరుచి మధు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హిందు వుల మనోభావాలు దెబ్బతినే విధంగా చేయవద్దని బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా నందిగామలో వినాయక నిమజ్జనం సందర్భంగా వైసీపీ నాయకులు మాంసాహార భోజనం పెట్టడం హిందువుల మనోభావాలు దెబ్బతినడమే అన్నారు. వైసీపీ నాయకులకు హిందువుల అంటే ఎందుకు వివక్ష అని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వ హయంలో హిందూ దేవాలయాలను ధ్వసం చేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిం చారన్నారు. శ్రీ వెంకటేశ్వర దేవాలయం సెట్టింగ్ వేసి పూజలు చేసినప్పుడు కూడా హిందువుల మనోభా వాలు దెబ్బతీన్నాయని, వైసీపీ నాయకులు ఇలాంటి కార్యక్రమాలకు పూనుకుంటే హిందువుల ఆగ్రహానికి గురికావలసిందే అన్నారు. నందిగామాలో మాంసాహారం వడ్డించిన వారిపై కఠిన చర్యలు తీసు కోవాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో హిందువుల పండు గల్లో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్యకర్తలకు టీడీపీలోనే సమన్యాయం

నంద్యాల రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలకు టీడీపీలోనే సమన్యాయం జరుగుతుందని అయ్యలూరు గ్రామ మహిళా నాయకురాలు బైరెడ్డి శంక రమ్య అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ నం ద్యాల మండలం అయ్యలూరు గ్రామానికి చెందిన రాంభూపాల్‌రెడ్డి ఇటీవల రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌పై అనేక ఆరోపణలు చేశారన్నారు. మంత్రి ఫరూక్ గ్రామంలో అందరికీ సమన్యాయం చేస్తున్నారన్నారు. పార్టీకోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ అర్హ తలను బట్టి నామినేటెడ్ పదవులకు ప్రతిపాదిస్తున్నారన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు.. ఆరు టిప్పర్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

మహానంది, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం గాజులపల్లి సమీపంలోని అంకిరెడ్డి చెరువులో అర్ధరాత్రి అక్రమ మట్టి త్రవ్వకాలు జరిపి టిప్పర్ల సహాయంతో తరలిస్తుండగా స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం అర్ధరాత్రి అక్రమంగా మట్టి త్రవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు సిబ్బంది సహాయంతో దాడులు నిర్వహించామన్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఆరు టిప్పర్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ విషయంపై మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చామని ఎస్ఐ తెలిపారు.

ఎరువుల దుకాణాలపై అధికారుల దాడులు



ఎరువులను సీజ్ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

మహానంది, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మహానంది మండలంలోని ఎరువుల దుకాణాలపై ఆదివారం ఉమ్మడి కర్నూలు జిల్లా విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. మండలంలోని బుక్కాపురం లోని బైసాని ట్రేడర్స్, మహానందీశ్వర ఫెర్టిలైజర్స్‌తో పాటు గాజులపల్లిలోని గఫారియా ఫర్టిలైజర్ దుకాణాలపై దాడులు చేశారు. వంద యూరియా బస్తాలను అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించామని విజిలెన్స్ స్టాండ్ ఎన్ఫోర్స్మెంట్స్ ఎస్ఐ వెంకట ప్రసాద్ తెలిపారు. అలాగే ఈపాస్ మిషన్‌లో స్టాక్ నిల్వల్లో తేడాలున్నాయన్నారు. బైసాని ట్రేడర్స్‌లో రూ.5 లక్షల 93 వేల విలువగల 25.47 టన్నుల యూరియా, గఫారియా ట్రేడర్స్‌లో రూ.16 లక్షల 45 వేల విలువ గల 57.75 టన్నుల రసాయానిక ఎరువులను సీజ్ చేసామని విజిలెన్స్ ఎస్ఐ చెప్పారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి. నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

15 నుంచి యూటీఎఫ్ 'రణభేరి జాతా'

నందికొట్కూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఐదు ప్రాంతాల నుంచి సెప్టెంబర్ 15వ తేదీ నుంచి యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రచార రణభేరి జాతా ప్రారంభిస్తున్నామని యూటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కార్యదర్శి మూర్తుజావలి తెలిపారు. ఆదివారం పట్టణంలోని శ్రీ నంది జూనియర్ కళాశాలలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచిపోయినా ఇంత వరకు వేతన కమీషన్ నియమించ లేదన్నారు. నాలుగు విడతల కరువు భత్యం పెండింగ్‌లో ఉందన్నారు. సరెండర్ లీవ్స్ బకాయిలు పేరుకుపోయాయని, వీటి సాధన కోసం ప్రచార రణభేరి జాతాను ఉమ్మడి కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో ప్రారంభించ నున్నట్లు తెలిపారు. ఈ జాతా నంద్యాల, బనగానపల్లె, డోన్ మీదుగా కర్నూలు చేరుకుంటుందన్నారు. యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, శ్రీనివాసులు, జగదీష్, మధు, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం

● శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



మాట్లాడుతున్న శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వంలో రైతులకు సకాలంలో ఎరువులు అందించి ఆదుకున్నామన్నారు. సెప్టెంబరు 9న ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆ పార్టీ నాయకులు మోమిన్ అహ్మద్‌హుసేన్, రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: హామీలను అమలుపరచడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా అన్నారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి నివాసంలో అన్నదాత పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 9న నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, అమీర్, శశికళారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- ● ఏటిపాయకు మంచిరోజులు ● కేంద్ర కమిటీకి ప్రతిపాదనలు
- ● ట్రిబ్యునల్‌లో రూ. 135 కోట్లకు మంజూరు
- ● తాగు, సాగునీటి సమస్యకు పరిష్కారం
- ● 3 వేల ఎకరాల మెట్ట భూములకు అందనున్న సాగునీరు

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఏటిపాయకు మంచి రోజులు రానున్నాయి.. సుమారు 29 యేళ్ల నిరీక్షణ ఫలించనుంది.. 1992లో ప్రారంభమై నాలుగేళ్లకే కొట్టుకుపోయిన ట్యాంకు నిర్మాణం ఎట్టకేలకు ప్రారంభానికి నోచుకోనుంది. ఫలితంగా మూడు వేల ఎకరాల మెట్ట భూములకు సాగునీరు అందనుంది.





చెక్‌డ్యాం నిర్మించాల్సిన ఏటిపాయ వంక.. చెక్‌డ్యాం నిర్మించాల్సిన ప్రదేశం

పాణ్యం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాణ్యం మండలంలోని తమ్మరాజుపల్లె గజ్జలకోన లోని ఏటిపాయ నిర్మాణంతో తమ్మరాజుపల్లెలోని దాదాపు మూడు వేల ఎకరాల వర్షాధారిత వ్యవసాయ భూములకు సాగునీరు అందనుంది. గతంలో ఆయకట్టు లేదని, నిధులు లేవని నిర్మాణాన్ని ప్రభుత్వాలు జాప్యం చేసినా ట్యాంకు నిర్మాణ అవసరాన్ని గుర్తించిన నేటి పాలకులు కేంద్ర కమిటీ వరకు ప్రతిపాదనలు చేర్చారు. దీంతో కొంతవరకు పనులు ప్రారంభానికి నోచుకునే వీలు కలిగిందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.135 కోట్లతో ట్రిబ్యునల్‌లో ప్రతిపాదించగా నిధుల మంజూరుకు హామీ ఇచ్చిందని అధికారులు పేర్కొన్నారు. దీంతో కేంద్ర జలవనరుల కమిటీకి ప్రతిపాదనలు పంపించారు.

తీరనున్న సాగునీటి కొరత

తమ్మరాజుపల్లె గ్రామ వ్యవసాయ ప్రాంతం పూర్తిగా వర్షాధారిత ప్రాంతం. దాదాపు మూడువేల ఎకరాలు వ్యవసాయ భూముల్లో బోర్ల ద్వారా పంటలు సాగు చేసుకుంటున్నారు. వేసవిలో బోర్లు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతుండేవారు. అలాగే తాగునీటికి ఇబ్బంది పడేవారు. దాదాపు 300 నుంచి 500 అడుగుల లోతు వరకు బోర్లు వేసినా నీటి జాడలేక కనిపించలేదు. దీంతో నాటి ప్రభుత్వం ఏటిపాయ నిర్మాణాన్ని చేపట్టింది. 1996లో వరదల వల్ల ట్యాంకు పూర్తిగా కొట్టుకుపోవడంతో అప్పటి నుంచి పాలకులు నిర్మాణానికి కృషి చేసినా ఫలితం లేకపోయింది.

గ్రాసం లేక పశువులను..

గ్రామంలో ప్రతియేటా తాగునీటి ఎద్దడి ముంచుకొస్తోంది. నీటి కొరతతో పాటు పశుగ్రాసం లేక పశువులను తెగనమ్ముకోవలసిన పరిస్థితి ఏర్పడుతోందని పాలకులు, అధికారుల దృష్టికి రైతులు తీసుకెళ్లినా ఫలితం లేదు. ప్రస్తుతం డ్యాం నిర్మాణంతో ఈ సమస్యలు తొలగిపోతాయని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మూడు వేల ఎకరాలకు సాగునీరు

ఏటిపాయ చెక్‌డ్యాం నిర్మాణం ద్వారా దాదాపు 3 వేల ఎకరాల మెట్ట భూములకు పుష్కలంగా సాగునీరు అందుతుంది. గొట్టం బావులపైనే ఆధారపడి సాగవుతున్న ఈ భూములు ఎండాకాలంలో బోర్లు ఎండిపోయి రైతులు నష్టాలకు గురవుతున్నారు. డ్యాం నిర్మాణంతో ఆ సమస్య తీరనుంది

రైతుల్లో ఆనందం

తమ్మరాజుపల్లె ప్రజలకు ప్రధాన జీవనాధారం వ్యవసాయమే. ఇసుక నేలలు కావడంతో అధికంగా పత్తి, వేరుశనగ, పొద్దుతిరుగుడు, కంది, వరి, కూరగాయలు, సాగుచేస్తారు. గతంలో వర్షాలు లేక భూగర్భ జలాలు తగ్గి బోర్లు ఎండిపోయి నష్టాలపాలయ్యారు. ఏటిపాయ ట్యాంకు నిర్మాణానికి కేంద్ర జలవనరుల కమిటీ వరకు ప్రతిపాదనలు వెళ్లేలా టీడీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో తమ్మరాజుపల్లె రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఎమ్మెల్యే గౌరు చరితకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల ఇబ్బందులు తొలగిపోతాయి



ఏటిపాయ చెక్‌డ్యాం నిర్మాణంతో రైతుల ఇబ్బందులు తొలగిపోతాయి. నష్టాల నుంచి బయట పడతాము. పశుపోషణ, తాగునీటి సమస్యలు తలెత్తవు. ఈ ట్యాంకుకు బేతంచెర్ల, బుగ్గన్నపల్లె, సిమెంటునగర్ ప్రాంతాలనుంచి నీరు చేరుతుంది. దీంతో సాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు ఉండవు. రాష్ట్ర ప్రభుత్వం ట్యాంకు నిర్మాణానికి నిధులు కేటాయించి, కేంద్ర జలవనరుల కమిటీకి ప్రతిపాదించడం హర్షణీయం.

- మద్దయ్య, రైతు, తమ్మరాజుపల్లె

రూ.1.35 కోట్లతో ప్రతిపాదనలు

రాష్ట్ర ప్రభుత్వం ఏటిపాయ పర్క్యులేషన్ ట్యాంకు నిర్మాణానికి రూ. 1.35 కోట్లతో ట్రిబ్యునల్‌లో ప్రతిపాదించగా నిధుల మంజూరుకు హామీ ఇచ్చింది. దీంతో కేంద్ర జలవనరుల కమిటీకి ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించడానికి హామీ ఇవ్వడంతో కేంద్ర నిధుల కోసం జలవనరుల శాఖకు ప్రతిపాదనలు పంపించారు. ఏటిపాయ నిర్మాణంతో వ్యవసాయానికి,తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు ఉండవు. కేంద్ర కమిటీ మంజూరు అనంతరం నిర్మాణ పనులు చేపడతాం.

- నాగన్న ఎంఐ డీఈఈ

పాడిపశువుల అభివృద్ధికి తోడ్పాటు



ఏటిపాయ చెక్ డ్యాం నిర్మాణం పాడి పశువుల అభివృద్ధికి దోహదం చేస్తుంది. తాగునీరు లేక పాడి పశువులను అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాధార గ్రామం కావడంతో వేసవిలో పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడుతుంది. గ్రామంలో పాడి రైతులు పాల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నారు. ట్యాంకు నిర్మాణంతో పాడి రైతుల సమస్యలు తొలగిపోనున్నాయి. ఏటిపాయ నిర్మాణంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

- శ్రీనివాసులు, రైతు, తమ్మరాజుపల్లె

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు : సీఐ



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్య క్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. తాటిపాడు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అనుమానితుల ఇంట్లో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని సుంకులమ్మ దేవాలయం వద్ద ప్రజలతో సమావేశం నిర్వహించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. పోక్సో కేసులు, మహిళలపై అఘాయిత్యాలు, సైబర్‌నేరాలు, రోడ్డుప్రమాదాలు, హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. బెల్ట్‌నిర్వహిస్తున్న పాం డురంగస్వామి వద్ద 20 మద్యం సీసాలు, 3 బీరు సీసాలు, తలారి ఖాసీంవద్ద 17 మద్యం సీసాలు పట్టుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. అలాగే 10 వాహనాలకు సరైన కాగితాలు లేకపోవడంతో రుసుం విధించారు. ఉపతహసీల్దార్ నాగన్న, ఎస్ఐ మల్లికార్జున, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

నంద్యాల కల్చరల్,సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తానని బ్రాహ్మణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రామరాజు అన్నారు. నంద్యాల జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాహ్మణ ఆత్మీయ సమావేశాన్ని నంద్యాల ఎస్ఎస్ఎన్ఎస్ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా వెంకటరామరాజు హాజరై మాట్లాడారు. రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య కార్యదర్శి సుదీర్ మట్లాడుతూ జిల్లాలో బ్రాహ్మణ వివాహ భవనం, కమ్యూనిటీ హాల్‌కు నిధులు కేటా యింపు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకులకు కూటమి ప్రభుత్వం నుంచి రూ.10 వేల పారితోషికం అందడం లేదని సమాఖ్య అధ్యక్షుడికి తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. బ్రాహ్మణ సేవాసమాఖ్య సభ్యులు, మహిళా విభాగం అధ్యక్షురాలు శాంతి, నంద్యాల జిల్లా బ్రాహ్మణ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు రమేష్‌కుమార్

ఆత్మకూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ రైతు సంఘం 2వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌కుమార్, రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆత్మకూరు పట్టణంలో అక్టోబరు 11, 12 తేదీల్లో ఏపీ రైతు సంఘం 2వ జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభల్లో ప్రధానంగా వ్యవ సాయ సమస్యల పరిష్కారానికి సంబంధించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు చెప్పారు. ఈ సభలకు రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆహ్వాన సంఘం కమిటీని ఎన్నుకున్నారు.

యూరియాపై వైసీపీ ఆరోపణలు హాస్యాస్పదం

● టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ నాయుడు

పాణ్యం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : యూరియా పంపిణీపై వైసీపీ ఆరోపణలు హాస్యాస్పదమని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాంమోహన్ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రైతులకు ఎన్డీఏ ప్రభుత్వం యూరియా అందించడంలో విఫలమైందని పాణ్యం వైసీపీ మండల నాయకులు చేసిన ఆరోపణలకు ఆయన సమాధానమిచ్చారు. టీడీపీ నాయకులు యూరియా కొరత సృష్టిస్తున్నారని పేర్కొనడం విచారకరమన్నారు. పారదర్శకంగానే యూరియా పంపిణీ జరుగుతోందన్నారు. పాణ్యం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి చూడలేకనే ఈ ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి లక్షల టన్నుల యూరియా తీసుకు రావడంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సఫలమైందన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు సంపద సృష్టించి అభివృద్ధి సంక్షేమ పథకాలు ఇవ్వడంలో చంద్రబాబుకుసాటి లేరన్నారు. ఎన్నికల హామీ లైన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేసి కూటమి మాట నిలబెట్టుకుందన్నారు. చంద్రబాబునాయుడుపై నమ్మకంతోనే ప్రజలు వైసీపీకి ప్రతిపక్ష హోదా లేకుండా చేశారన్నారు.

లోక కల్యాణం కోసమే సామూహిక యజ్ఞాలు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్ర గ్రహణం, పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని లోక కల్యాణం కోసం సామూహిక యజ్ఞ, విశేష పూజలు నిర్వహించామని యోగా గురువు యోగానంద అన్నారు. ఆదివారం నంద్యాల హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన అమ్మస్ఫటిక లింగేశ్వరాలయ ప్రాంగణంలోని అచల పరిపూర్ణయోగానంద పాములేటి స్వామి ఆశ్రమంలో సంపూర్ణ చంద్రగ్రహణం, పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంద్యాల, పరిసరప్రాంతాల భక్తులు సామూహిక యజ్ఞపూజలు చేశారు. భక్తులకు దాత వెంకటేశ్వరరెడ్డి అన్నప్రసాద వితరణ చేశారు.

ఉపాధ్యాయులకు సత్కారం

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 20 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మిలాదున్ నబి, టీచర్స్ డే సందర్భంగా నడిగడ్డ నేషనల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఐటా రాష్ట్ర అధ్యక్షుడు చాన్‌బాషా, రాష్ట్ర సలహాదారు షబ్బీర్, జిల్లా అధ్యక్షుడు మహ్మద్‌సలీం, ప్రధాన కార్యదర్శి ఇర్ఫాన్‌ల ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్తమ సేవలందిస్తున్న 20 మంది టీచర్లను గుర్తించి సత్కరించారు.

బస్సు, మోటార్ సైకిల్ ఢీ.. ఒకరికి గాయాలు

మహానంది, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం గాజులపల్లి అంకిరెడ్డి చెరువు సమీపంలోని మలుపు వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సు, ఎదురుగా వస్తున్న మోటార్ బైక్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన వడ్డే వెంకటేష్ గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వెంకటేష్ మోటార్ బైక్‌పై గిద్దలూరు వైపు వెళ్తుండగా అంకిరెడ్డి చెరువు మలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు మోటార్ బైక్‌ను ఢీ కొంది. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత



మహానందిలో ఆలయం తలుపులు మూసివేస్తున్న వేదపండితులు, అధికారులు

మహానంది, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మహానంది క్షేత్రంలోని ప్రధాన ఆలయాల తలుపులను ఏఈఓ మధు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు మూసివేశారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున గ్రహణం విడిచాక ప్రధాన ఆలయాల్లో సంప్రోక్షణ పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

ఆత్మకూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా ఆత్మకూరు పట్టణంలోని అన్ని ఆలయాలను మూసివేశారు. ఆదివారం ఉదయం ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మూసివేశారు. ఆలయాల లోపలికి గ్రహణ ప్రభావం వాటిల్లకుండా కిటికీల వద్ద దుస్తులను ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారుజామునే ఆయా ఆలయాలను తెరచి సంప్రోక్షణ చర్యలు చేపట్టి నిత్య పూజలను కొనసాగించనున్నట్లు ఆయా ఆలయాల అర్చకులు తెలిపారు.

పాణ్యం: మండలంలోని కొత్తూరు సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం మూసి వేశారు. అర్చకులు సురేష్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన ద్వారానికి తాళం వేశారు.

ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్నం నివేదన అనంతరం ఒంటిగంటకు ఆలయం మూసివేసినట్లు తెలి పారు. సోమవారం ఉదయం ఐదు గంటలకు ఆల య శుద్ధి, సంప్రోక్షణ, ఏకాంత సేవల అనంతరం భక్తులకు పునర్దర్శనం, అభిషేకాలు కల్పించ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో ఉన్న దుర్గాభోగేశ్వర ఆలయం ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి మూసి వేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామ్‌సుందర్ శర్మ తెలిపారు. చంద్రగ్రహణం అనంతరం సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయాన్ని సంప్రోక్షణ చేసి దుర్గాభోగేశ్వరుడికి పూజలు నిర్వహిస్తామని అన్నారు. భక్తులు స్వామివారిని 5 గంటల అనంతరం దర్శించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే వైసీపీ డ్రామా: టీడీపీ

ఆత్మకూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాన్ని ఏదో ఒక విధంగా అప్రతిష్టపాలు చేయాలనే దురుద్దేశంతోనే రోజుకో కుట్రతో వైసీపీ డ్రామాలకు తెరలేపిందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖర రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం ఎమ్మెల్యే పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఉల్లి ధరలు తగ్గాయంటూ వైసీపీ కార్యకర్తలతో ఆత్మహత్య డ్రామా ఆడించి ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు కుట్రలు పన్నారన్నారు. కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం పోలకల్ గ్రామంలో మద్యం బాటిల్‌తో అన్నదాతల ఆత్మహత్య డ్రామా ఇందులో భాగమేనని ఎమ్మెల్యే మండిపడ్డారు. పండించిన ఉల్లిని కనీసం మార్కెట్‌కు కూడా తేకుండా గిట్టుబాటు ధర లేదంటూ వీడియో రికార్డు చేసి రైతులు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నామంటూ సెల్ఫీ వీడియోతో రైతుల్లో భయందోళనలు రేకెత్తించేందుకు కుట్రలు పన్నారన్నారు. ఖాళీ పురుగుల మందు సీసాలో మద్యం కలుపుకుని తాగి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ సెల్ఫీ వీడియోతో నాటకాలాడారన్నారు. డ్రామా ఆడిన ఇద్దరు మార్కెట్ యార్డు డైరెక్టర్ అనుచరులు, వైసీపీ కార్యకర్తలేనని అన్నారు. ప్రస్తుతం నాటకమాడిన వారి పరిస్థితి బాగానే ఉందని, అతిగా మద్యం సేవించడం వల్లే వారు ఇబ్బంది పడినట్లు వైద్యులు తెలిపారన్నారు. ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయడానికే ఈ నాటకమని అధికారులు ప్రాథమికంగా తేల్చారన్నారు.వీరి వెనుక ఉన్న వారిపైన పూర్తిగా దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డి డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డి



నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

ఉల్లి రైతు పేరుతో డ్రామాలు: ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభు;త్వాన్ని దెబ్బతీసేందుకే ఉల్లి రైతుల ముసుగులో వైసీపీ నాయకులు పురుగుల మందు తాగామంటూ డ్రామాలు ఆడుతున్నారని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ధ్వజమెత్తారు. కోడుమూరు నియోజకవర్గంలోని పోలకల్ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఉల్లి రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నామంటూ వినూత్నమైన డ్రామాకు తెరతీశారన్నారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డిని మొదలుకొని కింది స్థాయి కార్యకర్త వరకు డ్రామాలు ఆడడం వారికి పరిపాటిగా మారిందన్నారు. వాస్తవాలు పరిశీలి స్తే... పురుగుల మందు తాగిన రైతులను ఆసుపత్రికి తరలిస్తే... వైద్యులు పరీక్షలు చేసి వీరు సేవించింది పురుగులమందు కాదని, పురుగుల మందు బాటిళ్లలో మద్యం పోసుకొని సేవించినట్లు వైద్యుల నివేదికల్లో తెలుస్తోం దన్నారు. ఎప్పుడూ లేని విధంగా ఉల్లి పంటకు మద్దతు ధర రూ.1200 కేటాయించడంతో వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక, వారి ప్రభుత్వంలో డైరెక్ట ర్లుగా పని చేసిన వారి అనుచరులే ఈ విధమైన డ్రామాకు తెరతీశారన్నారు. ఉల్లి రైతులు అధైర్యపడవద్దని, మద్దతు ధరకు వరుస క్రమంలో రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా చేసే కార్యక్రమాలను నమ్మవద్దని ఆయన ఉమ్మడి కర్నూలు జిల్లా ఉల్లి రైతులకు సూచించారు.

ఎరువుల పంపిణీలో ప్రభుత్వం విఫలం

- ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి
- రేపు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన



పోస్టర్లను విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

డోన్ రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎరువులను పంపిణీ చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం వైసీపీ కార్యాలయంలో జడ్పీటీసీ సభ్యులు బద్దెల రాజ్‌కుమార్, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మెట్టు వెంకటేశ్వరరెడ్డి, జిల్లా వలంటీర్ విభాగం అధ్యక్షుడు పోస్టు ప్రసాద్‌తో కలిసి 'అన్నదాత పోరు' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అన్నదాతకు అండగా ఈనెల 9న ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. రైతులకు దక్కాల్సిన ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. నిరసన కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, పట్టణ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, పార్టీ యూత్ విభాగం అధ్యక్షుడు ఆర్‌ఈ రాజావర్ధన్, టీఈ దినేష్‌గౌడు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

దొర్నిపాడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాలమ్మ గుడి ఆవరణలో ఆదివారం కంటివైద్య శిబిరాన్ని భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా ఆయూష్ యోగా సేవా సమితి నిర్వాహకుడు ఆనంద్‌గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదాయానంద వైద్యశాల నుంచి డాక్టర్ సౌమ్యారెడ్డి పాల్గొని 150 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. టీడీపీ నాయకులు గంగవరం కృష్ణారెడ్డి, భార్య రాధికలను సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బత్తుల నాగేశ్వరయాదవ్, దూదెకుల ఉసేని, దొర్నిపాడు ఆర్ ఎంపీ వైద్యుడు నాగేంద్ర, సిబ్బంది రహిమ్, అశోక్, షాహిర్, వెంక టేశ్వర్లు, లింగేశ్వరనాయుడు, తదితరులున్నారు.

డోన్ రూరల్: పట్టణంలోని యశోద ప్రైవేటు ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. యశోద ఆసుపత్రిలో గైనకాలజిస్టులు డాక్టర్ సుంకన్న, డాక్టర్ యశోద వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. వైద్య నిపుణులు పరీక్షించి మందులు అందజేశారు.

అహోబిలం దేవస్థానానికి కారు విరాళం

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం దేవస్థానానికి భారతీయ స్టేట్ బ్యాంక్ అధికారులు ఆదివారం రూ. 20 లక్షలకు పైగా విలువ చేసే కియా 7 సీటర్ కారును విరాళంగా అందజేశారు. దేవస్థానం మనియర్ సౌమ్యానారాయణకు ఎస్బీఐ అధికారులు వాహన తాళాలు అందజేశారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. వేదపండితులు స్వామి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వీధి లైట్లకు మరమ్మతులు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వీధిలైట్లను సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించారు. గతవారం రోజులుగా వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రధాన రహదారి, ఆర్టీసీ బస్టాండు, తేరు వీధి ప్రాంతంలో చీకట్లు అలుముకున్నాయి. వీధిలైట్లకు మరమ్మతులు చేయించడంతో కాలనీల్లో వెలుగులు సంతరించికున్నాయి.

ఘనంగా మహాలయ పౌర్ణమి

బేతంచెర్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాలతో పాటు పట్టణంలో మహాలయ పౌర్ణమి వేడుకలను ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే మహాలయ పౌర్ణమి వేడుకల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్‌బాబు తన సిబ్బందితో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వవిద్యార్థులు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గూడూరు సంజీవరెడ్డి జూనియర్ కళాశాలలో 2020-22 బ్యాచ్‌కు చెందిన ఇంటర్మీడియట్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఆనాటి అనుభవాలను ఒకరికొకరు పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డితో పాటు అధ్యాపకులు మద్దిలేటి శ్రీను, మహేశ్వరరెడ్డి, భాస్కర్, నిర్మల, పార్వతి, శ్రీనివాసులు, మునిరెడ్డి అధ్యాపకులకు పాద పూజ చేసి సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ రహదారికి పచ్చ తోరణం



రహదారిలో ఆహ్లాదాన్ని పంచుతున్న చెట్లు

రుద్రవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం , నరసాపురం గ్రామాల మధ్య ఫారెస్టు అధికారులు ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. ఆ మొక్కలు పెరిగి మహా వృక్షాలయ్యాయి. రహదారి వెంట పచ్చదనం పందిరిలా అల్లుకుంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఈ పచ్చ తోరణాన్ని చూసి ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయాల మూసివేత



డోన్, బనగానపల్లె, ఆళ్లగడ్డ నియోజకవర్గాల పరిధిలోని ఆలయాలను చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మూసివేశారు. సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయాలను తెరచి ఆలయశుద్ధి చేసి పూజలు నిర్వహించి భక్తులకు స్వాములవారి దర్శనం కల్పిస్తామని అర్చకులు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

నీటి మునిగిన పొలాలు

- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు
- నష్టపరిహారం అందించాలని వేడుకోలు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నలకు అతివృష్టి, అనావృష్టి వల్ల ప్రతి ఏడాది నష్టం వాటిల్లి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మరో వైపు స్థానిక నదులు, వంకలు ఉప్పొంగి ఉధృతంగా ప్రవహించడంతో పంట పొలాలు నీట మునిగి దెబ్బతినడంతో రైతులు నష్టపోతున్నారు. కలుగొట్ల, జొలధరాశి, కోవెలకుంట్ల మీదుగా వెళ్లే కుందూనది నుంచి ప్రతి ఏడాది సోమశిల, కండలేరు ప్రాజెక్టులకు పోతిరెడ్డిపాడు నుంచి నీటిని తరలిస్తారు. ఈప్రాజెక్టుల కెపాసిటీ 146 టీఎంసీలు. గత 15ఏళ్లగా కుందూనది నుంచి నీటిని తరలిస్తున్నప్పుడు కలుగొట్ల - ఉప్పలూరు గ్రామాల మధ్య వేలఎకరాల పంట పొలాలు నీటి మునిగిపోతున్నాయి. కుందూకు ఆవతలి వైపు పొలాల్లోకి వెళ్లేందుకు వీలు లేకుండా పోవడంతో పొలాలు సాగు చేసుకోలేకపోతున్నారు. కుందూ నది ఉధృతంగా ప్రవహించకముందు జూన్, జూలై నెలలో రైతులు మోటార్ల ద్వారా పంట సాగు చేస్తారు. అయితే ఆగస్టులో వర్షాలు బాగా కురియడంతో కుందూనది ఉధృతంగా ప్రవహించడంతో ఆవతల వైపునకు రైతులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఒక దశలో పంటలు చేతికి వచ్చేసరికి కుందూ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అవతల వైపుకు వెళ్లలేకపోతున్నారు. దీనికి తోడు నీట మునగడంతో పంటలు కూడా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు వెయ్యి ఎకరాల్లో పంట నీటి మునిగిపోతుందని రైతులు తెలుపుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారులు, పాలకులకు తెలిపినా పరిష్కారం చూపలేదని రైతులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు కలెక్టర్, జలవనరుల శాఖ ఎస్‌ఈని కలిసి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయిందని కలుగొట్లకు చెందిన శ్రీనివాసరెడ్డి, సింగా జగదీశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, బాల వెంగన్న, సుబ్బరాయుడు, శివప్రసాద్, రాముడు, నాగగోపాల్, సుధాకర్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సుమారు 25 మంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటికీ అందని పరిహారం

జోళదరాశి సమీపంలో రిజర్వాయరు నిర్మించేందుకు రైతుల నుంచి భూములు తీసుకున్నారు. రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానీ, నేటికీ పరిహారం డబ్బులు అందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టాభూములు రిజర్వాయర్‌లోకి పోవడంతో రైతులు భూములు సాగు చేసుకోలేక ఇతరులకు అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశతో రైతులు ఉన్నారు.



కలుగొట్లలో కుందూ ఉధృతితో నీట మునిగిన పొలాన్ని చూపిస్తున్న రైతులు

నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి



కలుగొట్ల, ఉప్పలూరు, జోలధ రాశి గ్రామాల పరిధిలో కుందూ నది వెంట ఉన్న పొలాలు నీట మునిగాయి. దాంతో రైతులు ఇబ్బందులు పడుతన్నారు. నీట మునిగిన పొలాలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

- ఎం.శ్రీనివాసరెడ్డి, రైతు

అందుబాటులో యూరియా

- నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటి



మాట్లాడుతున్న మద్దిలేటి

బనగానపల్లె, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటి అన్నారు. ఆదివారం మండల వ్యవసాయకార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతం కంటే ఈ ఏడాది అధికంగా యూరియా సరఫరా చేశామన్నారు. గత ఏడాది 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. ఈ ఏడాది 48 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది 5.95లక్షల ఎకరాల్లో సాగు అయిందన్నారు. దుష్ప్రచారాలను నమ్మవద్దన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో ఇప్పటి వరకు రైతు సహకార కేంద్రాల ద్వారా 2,540 మెట్రిక్ టన్నులను రైతులకు పంపిణీ అయిందన్నారు. అలాగే రసాయనిక ఎరువుల దుకాణాల ద్వారా 3,700 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా ఎంత అవసరమో ప్రభుత్వానికి నివేదిక పంపనునట్లు తెలిపారు. అంతకుముందు పలు గ్రామాల్లో పర్యటించి వేసిన పంటలను గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల వ్యవసాయశాఖ ఏడీ సుధాకర్, ఏవో సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బాలికలు ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలి



విద్యార్థినులకు సర్టిఫికెట్లను అందిస్తున్న డీఎస్పీ ప్రమోద్

ఆళ్లగడ్డ, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): బాలికలు తప్పని సరిగా సెల్ఫ్ డిఫెన్స్(ఆత్మరక్షణ విద్య)ను నేర్చుకోవాలని డీఎస్పీ ప్రమోద్ సూచించారు. శక్తి కార్యక్రమంలో భాగంగా స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు 15 రోజుల పాటు ఆత్మ రక్షణ విద్యలో శిక్షణ ఇచ్చారు. 80మంది విద్యార్థులు తైక్వాండోలో శిక్షణ పొందారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మహిళల్లో శక్తిని పెంపొందించడం, వారి భద్రతపై అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సీఐ యుగంధర్, ఎస్ఐ నగీనా, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఫిర్దోస్ పాల్గొన్నారు.

విజృంభించిన విష జ్వరాలు

- చోద్యం చూస్తున్న వైద్యాధికారులు

చాగలమర్రి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చాగలమ్మ చెంచు కాలనీలో ఆదివారం విషజ్వరాలు విజృంభించాయి. కాలనీకి చెందిన ఒకే కుటుంబంలో పలువురు జ్వరంతో మంచం పట్టారు. చెంచు కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో చదివే పదిమంది విద్యార్థులు విషజ్వరాల బారిన పడ్డారు. ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి వైద్య చికిత్సలు చేయించుకుంటున్న జ్వరాలు తగ్గక పోవడంతో చెంచులు ఆందోళన చెందుతున్నారు. దోమలు కూడా అధికం కావడంతో చెంచులు అవస్థలు పడుతున్నారు. దోమతెరలు కూడా పంపిణీ చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వైద్యశిబిరాలు నిర్వహించడంలో వైద్యాధికారులు నిర్లక్ష్యం వహించడంపై పలువురు పెదవివిరుస్తున్నారు. డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాలు కూడా నిర్వహించడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు వైద్యాధికారులు స్పందించి శిబిరం ఏర్పాటు చేసి జ్వరం నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రిజర్వాయర్‌లో మృతదేహం లభ్యం

అవుకు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అవుకు రిజర్వాయర్‌లో గుర్తుతెలియని మృతదేహం ఆదివారం లభ్యమైంది. రిజర్వాయర్‌లో అంతర్భాగమైన పాలేరు చెరువులో మృతదేహం తేలియాడుతుండగా ఉదయం వాకింగ్‌కు వెళ్లిన స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు రిజర్వాయర్ వద్దకు చేరుకొని పారిశుధ్య కార్మికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. జీఎన్‌ఎస్ఎస్ కెనాల్ ద్వారా రిజర్వాయర్‌లోని మృతదేహం కొట్టుకు వచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహం ఆనవాళ్లు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

గొడవలకు పాల్పడితే చర్యలు

ప్యాపిలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ నాగార్జున హెచ్చరించారు. ఆదివారం మండలంలోని జలదుర్గం పోలీసుస్టేషన్‌లో ఆయన రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలతో కలిసి ప్రశాంతంగా జీవించాలన్నారు. మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పలువురు రౌడీషీటర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేబుల్ దొంగల బెడద

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో కేబుల్ దొంగల బెడద తీవ్రంగా మారింది. నిత్యం బోరు బావుల వద్ద ఏర్పాటు చేసుకున్న కాపర్ కేబుల్‌ను దుండగులు ఎత్తుకెళ్లుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దొంగల బెడదను నివారించాలని రైతులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం: సీఐ

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపనున్నట్లు సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేకాట, మట్కా, నాటుసారా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠినచర్యలు చేపడతామని హెచ్చరించారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు.

డీటీకి తహసీల్దార్‌గా పదోన్నతి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ బాబుకు తహసీల్దారుగా పదోన్నతి లభించింది. ఇక్కడ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న సువర్ణాదేవి కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ప్రసాద్ బాబు సోమవారం బాధ్యతలు తీసుకోనున్నారు.

యర్రగుంట్లలో అగ్ని ప్రమాదం

శిరివెళ్ల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో మస్తానయ్య దర్గా ఎదురుగా ఉన్న దుకాణం, నివాసంలో ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. పాశం పెద్ద బాల నాగయ్యకు చెందిన టీ స్టాల్‌లో గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. దుకాణంలోని సరుకులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇంట్లోని సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు రూ.నాలుగు లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు పెద్ద బాల నాగయ్య వాపోయాడు. మంటలను అదుపు చేసేందుకు గ్రామస్థులు తీవ్రంగా శ్రమించారు.

15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు 2024-25 ఏడాదికి సంబంధించి రెండో విడుతగా రూ. 26,04,873 నిధులు మంజూరు అయినట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేటాయించామన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆళ్లగడ్డ మండి మర్చెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు శివచరణ్ కోరారు. ఆదివారం స్థానిక అమ్మవారిశాల ఆలయంలో పట్టణంలోని రిటైల్ , హోల్‌సెల్ షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు పట్టణంలో ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందుకు ప్రతి షాపు యజమాని, ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, మండి మర్చెంట్ సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

బేతంచెర్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామాపురం గ్రామానికి చెందిన గొల్ల జయకృష్ణ (25) అనే యువ రైతు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల రామేశ్వరుడు సుబ్బలచ్చమ్మల దంపతుల కుమారుడు జయకృష్ణ తనకున్న పొలంలో చామంతి పూల పంట సాగు చేశాడు. పెట్టిన పెట్టుబడి కూడా చేతికందకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తల్లిదండ్రులు గమనించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తల్లి సుబ్బలచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కబ్జాకు గురైన స్థలాలను ఇప్పించాలి



అధికారులు ఇచ్చిన పట్టాలను చూపుతున్న హరిసర్వోత్తమ్మ రెడ్డి నగర్ వాసులు

డోన్ టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గత పది సంవత్సరాలుగా కబ్జాదారుల చేతుల్లో ఉన్న తమ స్థలాలను ఇప్పించి న్యాయం చేయాలని పట్టణంలోని కోట్ల హరిసర్వోత్తమ రెడ్డి నగర్ వాసులు రమీజాబీ, మహబూబ్ సాహెబ్, బాబులాల్ సుధాకర్‌లు కోరారు. ఆదివారం బాధితులు విలేకరుల ముందు తమ గోడును మొర పెట్టుకున్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఎదురుగా గల సర్వే.నెం.510లో 2007 సంవత్సరంలో దాదాపు 120 మందికి ఇళ్ల స్థలాలు కేటాయిం చారన్నారు. నివాస గృహాలు నిర్మించుకునేందుకు హౌసింగ్ బోర్డు నుంచి కూడా కొంత నగదు వచ్చిందన్నారు. బేస్‌మట్టాలు వేసుకున్నా మన్నారు. వాటిని కూల్చివేసి అధికార పార్టీ ముఖ్య నాయకుడి అనుచ రులు తమ స్థలాలను ఆక్రమించుకున్నారన్నారు. తమను భయభ్రాం తులకు గురి చేయగా పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఇచ్చిన పట్టాలకు తిరిగి తమకే చెందేవిధంగా న్యాయం చేయాలని బాధితులు కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

- టీడీపీ నియోజకవర్గ కో కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సహకారంతో కనకాద్రిపల్లె గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని టీడీపీ నియోజకవర్గ కో కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి అన్నారు. వేసవిలో ఏర్పడుతున్న తాగునీటి సమస్యను నివారించేందుకు అవుకు రిజర్వాయర్ నుంచి కనెక్షన్ ఇచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. ఇందు కోసం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రూ.40లక్షలు విడుదల చేయడంతో సంపు నిర్మాణం పనులు మొదలు పెట్టినట్లు తెలిపారు. పనులు పూర్తయితే కనకాద్రి పల్లెలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు.

ముగిసిన చౌడేశ్వరీ మాత జ్యోతి ఉత్సవాలు

- హుజరైన సహకార సంఘం చైర్మన్ మూల శివారెడ్డి



గ్రామంలో జ్యోతుల ఊరేగింపు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు గ్రామంలో మహాలయ పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన చౌడేశ్వరి మాత జ్యోతి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. అందంగా అలంకరించిన అమ్మవారి జ్యోతులను శనివారం అర్ధరాత్రి నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. తొగటవీరుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈసందర్భంగా హనుమంతుగుండం సొసైటీ చైర్మన్ మూల శివారెడ్డి, పలువురు నాయకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మెరుగైన వైద్యం అందించాలి



ఆసుపత్రిని పరిశీలిస్తున్న తహసీల్దారు పవన్ కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జ్వరాల బారిన పడి అల్లాడిపోతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేసి వార్డులను పరిశీలించారు. ఓపీ వివరాలు, రోజూ ఎంతమంది జ్వరపీడితులు ఆస్పత్రికి వస్తున్నారు.. ఎలాంటి కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయోనని డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డితో మాట్లాడి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించాలని తహసీల్దారు సూచించారు. అలాగే పట్టణంలోని పలు కాలనీల్లో మురుగు కాల్వలను శుభ్రం చేయించి, ఫాగింగ్ చేయాలని ఈవోకు సూచించారు.

హామీలు నెరవేర్చడం టీడీపీకే సాధ్యం

చాగలమర్రి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత టీడీపీకే సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, దూదెకుల సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాష అన్నారు. ఆదివారం బీసీ సంఘ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సూపర్-6 పథకాలను అమలు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు

చాగలమర్రి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను అందిస్తున్నట్లు పశు సంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. ఆదివారం పశువైద్యశాలలో ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు 75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 5 కేజీల ప్యాకెట్ ధర రూ.460 కాగా సబ్సిడీ పోగా కేవలం రూ.115 ఇస్తామన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

తాగునీటి పైపులైను ఏర్పాటు చేయాలి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జోళదరాశి గ్రామంలోని దళిత కాలనీలో తాగునీటి పైపులైను, కుళాయిలు ఏర్పాటు చేయించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో రెండేళ్ల క్రితం ప్రభుత్వ నిధులతో అన్నికాలనీలకు పైపులైను ఏర్పాటు చేయించారని, అయితే దళిత కాలనీకి మాత్రం పైపులైను ఏర్పాటు చేయించలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. తమ కాలనీకి పైపులైను ఉండేదని, సీసీ రోడ్లు వేయించడంతో పైపులైను ధ్వంసమైందన్నారు. పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానికులు సుధాకర్, రాజమద్దిలేటి, లైసమ్మ, పలువురు ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి దళితకాలనీకి పైపులైను, కుళాయిలు ఏర్పాటుచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కుందూకు తగ్గని వరద

- 14 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం

చాగలమర్రి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద కుందూనది వరద తగ్గలేదు. 14 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి ఆదివారం తెలిపారు. ఆనకట్ట నుంచి కేసీ ప్రధాన కాలువకు 800 క్యూసెక్కుల నీటితో ప్రవహిస్తుందన్నారు. ఆనకట్ట పరిధిలో 80 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు.

యూరియా కోసం తప్పని నిరీక్షణ

రుద్రవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మన గ్రోమోర్ కేంద్రం వద్ద ఆదివారం రైతులు యూరియా కోసం నిరీక్షించారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి యూరియా బస్తాల కోసం రైతులు తరలివచ్చారు. ఏవో సుమతి స్పందించి మన గ్రోమోర్ కేంద్రం వద్ద రైతులకు యూరియా బస్తాలు అందేలా చర్యలు తీసుకున్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

బేతంచెర్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహానీయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ అని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మరళీకృష్ణ, సభ్యులు కోడే వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం సీతారామాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వాజీదున్నీసాబీ, ఉపాధ్యాయురాలు సుజాతను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సురా మధు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు నజీమున్నిసా జనార్దన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకట శేషయ్య, వెంకట్ నాయక్, శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ సభ్యులు వలిబాషా, కేశాల్ నాయుడు, వన్నూరు సాహేబ్ పాల్గొన్నారు.

సరైన కోత పద్ధతులు పాటించాలి

డోన్ రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉల్లిపాయల దిగుబడి నాణ్యత సామర్థ్యాన్ని పెంపొందించడానికి సరైన కోత పద్ధతులు పాటించాలని ఉద్యానశాఖ అధికారి కళ్యాణి సూచించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ పంట వేసిన 90-120 రోజుల్లో పంట కోతకు వస్తుందన్నారు. ఉల్లిపాయ గడ్డలు పూర్తిగా పెరిగిన తర్వాత పైపూత ఆకులు గోధుమ రంగులో మారిపోతుంటాయన్నారు. ఇటువంటి సమయంలో నేలవైపు వంగిపోయినప్పుడు మాత్రమే ఉల్లిపాయ గడ్డలు కోయాలని ఆమె సూచించారు. కోసిన ఉల్లి పాయలను నీడలో వారం రోజులు ఆరబెట్టి మార్కెట్‌కు తరలిస్తే మంచి రేటు వస్తుందన్నారు.